రోడ్లపైనే వ్యాపారాలు..!

ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

- రాకపోకలు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై తోపుడు బండ్లు, కనిపించని ఫుట్‌పాత్

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు అంతులేకుండా పోతుంది. ప్రధాన రహదారులు, మార్కెట్ ఏరియాల్లో షాపుల యజమానులు, చిరువ్యాపారులు ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. విచ్చలవిడిగా బోర్డులను తెచ్చి రోడ్డుపై పెట్టి వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో మార్కెట్ ఏరియాలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అయినా మున్సిపల్, పోలీస్ అధికారులు కనీసం చర్యలు తీసుకోక పోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

గతంలో పట్టణంలోని శాస్త్రీ రోడ్, మీ సేవా రోడ్డు, మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, రాజీవ్‌గాంధీ మార్కెట్ ఏరియాలో ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్డుపై ఇష్టారాజ్యంగా నిర్వహించే వ్యాపారాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. దీంతో మార్కెట్‌లో సమస్య తక్కువగా ఉండేది. కానీ ఇటీవల పోలీస్, మున్సిపల్ శాఖాధికారులు కనీసం పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిత్యం ఇటు తిరుగుతున్నా కనీస చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మార్కెట్ ఏరియా, దమ్మపేట సెంటర్, నటరాజ్ సెంటర్, బస్టాండ్ సెంటర్ కూడళ్లల్లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. పాలకవర్గం లేకపోవడం అధికారులను అడిగేవారు లేక పోవడంతో విధులపై, ప్రజా సమస్యలపై పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ ఇక్కట్లు



రోడ్డు మీద వేసిన డెకరేషన్ టెంటు, బోర్డు

రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవడం, ఇరుకుగా ఉండే శాస్త్రీ రోడ్, మార్కెట్ ఏరియా, దమ్మపేట సెంటర్, బస్టాండ్ సెంటర్లలో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యంగా మారాయి. ఇక మార్కెట్ రోడ్లలో చిరువ్యాపారాలన్నీ రోడ్డుమీదనే చేస్తున్నారు. షాపుల నిర్వాహకులు ఫుట్‌పాత్‌లను అమాంతం ఆక్రమిస్తున్నారు. రోడ్డుపైనే అడ్డుగా బోర్డులు పెట్టడం, షాపుల రేకులు వేసుకుని ముందు వరకు వస్తు సామగ్రి కనిపించేలా పెడుతున్నారు. ఒకరిని చూసి మరొకరు ఇలా ముందు, ముందుకు వస్తుండటంతో సమస్య తీవ్రతరంగా మారుతుంది. షాపుల ముందు చిరు వ్యాపారులు పెట్టుకునేందుకు ఇస్తూ వారి నుంచి రోజుకు రూ.200 నుండి రూ.400 అద్దె వసూలు చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అన్ని షాపులు ఇదే కోవలో చేస్తున్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



ఫుట్‌పాత్ ఆక్రమణలు అధికంగా ఉన్నాయి. షాపు ముందు భాగం వరకు సరుకులు కనిపించాలని పెట్టుకుని, షెడ్లు వేసుకున్నారు. బోర్డులు రోడ్డుపైనే పెడుతున్నారు. ఇక కొన్ని షాపులు టెంట్లు వేసి ప్రచారం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై అడ్డంగా బండ్లు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలి.

– మల్లేష్, స్థానికుడు

అధికారులు దృష్టి సారించాలి



ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ట్రాఫిక్ సమస్యలకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఫుట్ పాత్‌లపై వ్యాపారాలు సాగించే వారికి ప్రత్యామ్నంగా మరో చోట షాపులకు అవకాశం ఇవ్వాలి. నిబంధనలు అతిక్రమించి రోడ్డుపైకి వచ్చే వాటిని తక్షణం తొలగించి విధంగా అధికారులు దృష్టి సారించాలి.

– గౌని నాగేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు

చర్యలు తీసుకుంటాం



వ్యాపారులు ప్రజల ఇబ్బందులను సైతం గుర్తించాలి. వారి షాపులు సరుకును వారి పరిధిలోనే పెట్టుకోవాలి. ఫుట్ పాత్‌లు గతంలో నిర్మించాం. వాటిని వదిలి లోపలికి ఉండాలి. ఆక్రమించి ముందుకు నడిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ఉన్న వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలు సహకరించాలి.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: మాచినేనిపేటతండాకు చెందిన బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు తల్లి లకావత్ లక్ష్మీ ఇటీవల మృతి చెందగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు ఆదివారం గిరిబాబు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు గోపాలక్రిష్ణమూర్తి, ఎదళ్లపల్లి వీరభద్రం, మాజీ జేడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, చావా వెంకటరామారావు, సొసైటీ డైరెక్టర్లు లకావత్ హేమ్లా, భూక్యా జవహర్‌లాల్, భూక్యా రాములు, సేవా నాయక్, బానోత్ చందర్ ఉన్నారు.

సెక్యూరిటీ గార్డులకు సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: పదవీ విరమణ పొందిన సింగరేణి సెక్యూరిటీ గార్డులను ఏరియా జీఎం వీసం కృష్ణయ్య సత్కరించారు. ఆదివారం జీఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెక్యూరిటీ విభాగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు బి. రాందాస్, కె. సుందర్, జి. వెంకటేశ్వర్లును శాలువ, గిఫ్ట్ అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సెక్యూర్టీ అధికారి అంజిరెడ్డి, ఆఫీస్ సూపరిండెంట్ రామకృష్ణ, ఫిట్ సెక్రెటరీ దాట్ల వెంకటేశ్వర్లు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బీ టైప్ క్వార్టర్లు కేటాయింపు.. ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు బీ టైప్ క్వార్టర్లు కెటాయించారు. ఆదివారం ఎస్ఓటూ జీఎం బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించారు. పూర్తి పారదర్శకంగా కేటాయింపు జరుగుతుందని వెంకటేశ్వర్లు తెలిపారు. పీఎం జీవీ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ జి.వీరన్న పాల్గొన్నారు.

అనర్హులను తొలగించాలి

పాల్వంచ: కేటీపీఎస్ యాష్ తరలింపునకు ఐటీడీఏ ఎంపిక చేసిన లిస్ట్‌లో అనర్హులు ఉన్నారని, వారిని తొలగించాలని గిరిజన కాంట్రాక్టర్ భట్టు వీరన్న అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నాన్ లోకల్ కాంట్రాక్టర్ అయిన చందర్, సరైన సర్టిఫికేట్లు లేని రాజగోపాల్‌లను తొలగించాలని ఆరోపించారు. కొందరు వారి స్వార్థం కోసం అమాయక గిరిజనులతో నెలన్నర రోజుల పాటు ఆందోళనలు చేయించారన్నారు.

విద్యార్థులపై చిత్తశుద్ధితో వ్యవహరించాలి

పాల్వంచ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల చదువులపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షులు జూపెల్లి దుర్గా ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో మాట్లాడారు. విద్యార్థులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదని, మెస్ ఫీజులు విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు ఏమీ లేవని, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులపై నియంత్రణ లేకుండా పోయిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు దీపక్ మెహతాబ్, సోను, మీరావలి, అఖిల్, ముస మీర్ సలీం, రామారావు పాల్గొన్నారు.

కోలాట బృందం సంబురాలు



సంబురాల్లో కోలాట బృందం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతినగర్ లోని రాధాకృష్ణ కోలాట బృందం ఏర్పడి తొమ్మిదేళ్లు సందర్భంగా ఆదివారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాట గురువులు వాసు, లక్ష్మీలను సన్మానించారు.

నివాళి

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ కండక్టర్ దెబ్బెందుల నాగయ్య సతీమణి పద్మ ఆదివారం మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు ఆమె భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, నరసింహారావు, పోతురాజు నాగరాజు, రామకృష్ణ, కిరణ్, మందా సురేష్, తదితరులు ఉన్నారు.

ప్రజల హృదయాల్లో నిలిచేది కమ్యూనిస్టులే



నివాళులర్పిస్తున్న కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి అజరామరమైన పోరాటాలు చేసి అమరులైన కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సింగరేణి కార్మిక ప్రాంతమైన రామవరంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు, సీపీఐ నాయకుడు బరిగెల సాయిలు వర్ధంతి సందర్భంగా సాయిలు స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మిక, శ్రామిక హక్కుల సాధనకు నిరంతరం పనిచేస్తూ వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ చాలామంది యోధుల్ని కోల్పోవడం దురదృష్టకరమని అందులో బరిగెల సాయిలు ఒకరని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల వారసులుగా ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్త పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా మాట్లాడుతూ... అనతి కాలంలోనే మంచి నాయకులను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో సాయిలు సతీమణి మహిళా సమైఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు సంపూర్ణ, కుమారుడు ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్, నాయకులు కంచర్ల జమలయ్య, మునిగడప పద్మ, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, మాటేటి గోపాల్, మాతంగి లింగయ్య, హహీం, ఖయ్యూం, గోపికృష్ణ, రత్నకుమారి, ఎం ధనలక్ష్మి, షేక్ షాహిన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఐకమత్యంగా మెలగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ప్రత్యేక భాష కలిగిన లంబాడీలు ఐకమత్యంతో మెలగాలని డీఎస్పీ ఎన్.చంద్రబాను అన్నారు. ఆదివారం ఇల్లెందు జెండాలవాగు వద్ద లంబాడీలు వన భోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లంబాడీలు వన భోజనాలు వెళ్లటం అరుదుగా జరుగుతాయని, నిరంతరం పనులకే పరిమితమయ్యే ఈ వర్గం ఏడాది ఒకసారి అంతా ఒక చోట కలిసి సుఖసంతోషాలు పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి లక్ష్మీ, లంబాడీ కుల పెద్దలు బానోతు రవి నాయక్, నరహరి నాయక్, బానోతు వెంకటేశ్వర్లు, రవి, కోటేశ్వరరావు, భూక్యా కృష్ణ, కమల, తారా, రాంజీ, సరోజ, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో సాగుదాం..



నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్లు, నాయకులు

జూలూరుపాడు: అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. 1995లో ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డుల కోసం ధర్నా చేసేందుకు వెళ్లా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొమ్ముగూడెంకు చెందిన 13 మంది పార్టీ నాయకులకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కొమ్ముగూడెం గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నప్పటికీ రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్య తీరలేదన్నారు. అమరవీరుల ఆశయసాధనకు పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రజా పోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, లిక్కి బాలరాజు, రమేష్, మండల కార్యదర్శి యాసా నరేష్, బానోత్ ఇస్రా, బానోత్ రూప, రవి, బిచ్చు, మంగ్యా, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ఐజేయూ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న రాంనారాయణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా తృతీయ మహాసభలు ఫిబ్రవరి మాసంలో నిర్వహించాలని కొత్తగూడెంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. మహాసభల నిర్వహణకు జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఇమంది ఉదయ్‌కుమార్, మొబగాపు అనంద్‌కుమార్‌లతో పాటు జాతీయ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జునుమాల రమేష్, బివి రమణారెడ్డి, కోదూరి సత్యనారాయణలతో మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.రాం నారాయణ మాట్లాడుతూ తొలుత సభ్యత్వ నమోదు పూర్తి చేయాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కనుకు వెంకటేశ్వర్లు, సత్యానంద్, గిరిప్రసాద్, ఏర్పుల సుధాకర్, పెండ్యాల భాస్కర్‌రావు, చంద్రశేఖర్, జానీ, చారుగుండ్ల రమేష్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పూజలు



పూజలు చేస్తున్న సింగరేణి జీఎంలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయాన్ని ఆదివారం సింగరేణి జనరల్ మేనేజర్లు సేఫ్టీ కార్పొరేట్ జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ దంపతులు, ఎస్టేట్ జీయం రాధాకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించి అమ్మవారి శేషావస్త్రప్రసాదాలను అందజేశారు.

విరాళం..

పెద్దమ్మతల్లి భక్తులకు శాశ్వత అన్నదానానికి పాల్వంచ పట్టణానికి చెందిన వాకాటి శ్రీనివాసరావు అనిత దంపతులు రూ.10,116 విరాళాన్ని అందజేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఈ సందర్భంగా వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందు: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఏ నబీ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం వి. కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నబీ మాట్లాడుతూ.. కనీస వేతనం చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు ఇచ్చే ఆస్పత్రి క్వార్టర్లు, రక్షణ పరికరాలు, ఓటు హక్కు, జాతీయ పండుగ, ఆర్జిత సెలవులు, జీఓ 22 అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తాళ్లూరి కృష్ణ, ప్రేమ్, దాసరి మల్లయ్య, రాజేష్, శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సరైన సమాచారం ఇవ్వండి

సింగరేణి(కొత్తగూడెం): ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వస్తున్న సర్వే అధికారులకు లబ్ధిదారులు పూర్తి వివరాలు తెలపాలని 10వ వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ అన్నారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 10వ, వార్డ్‌లో సర్వే అధికారులు ఇళ్ల సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లబ్ధిదారులు ఇంట్లో లేని పక్షంలో ఒకటి రెండు సార్లు వెళ్లాలని, అవసరమైతే వారికి ఫోన్ చేయాలన్నారు. రామవరంలో రిజిష్టర్ స్థలం లేకుంటే, కొత్తగూడెంలో ఉన్న స్థలం వివరాలు తెలపాలన్నారు.

ఆయుర్వేదంతో అనారోగ్యానికి పరిష్కారం



ఆయుర్వేద వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఆయుర్వేదంలో ఆరోగ్య సమస్యలకు పరిష్కారం మార్గం సులభంగా ఉంటుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా కల్తీ వస్తువుల వినియోగం పెరిగిపోయినందున అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటికి సులభంగా పరిష్కారం ఆయుర్వేదంతో ఉంటుందని ఐఎంసీ ప్రతినిధులు చల్లోజి శ్రీనివాస్, కటకం నరేష్ అన్నారు. ఆదివారం ఇల్లెందులోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో వాకర్స్ క్లబ్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఇంటి అవసరాల కోసం ప్రజలు మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న వస్తువులు చాలా రకాలుగా కల్తీ జరుగుతున్న వాటి వల్ల అనారోగ్యం సంభవిస్తుందన్నారు. వస్తువుల్లో కెమికల్స్ కలపటంతో తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంసీ ప్రతినిధులు నాగరాజు,జయంత్, మధు, రాజేష్, రవి, డానియేల్, రాజశేఖర్, ప్రసాద్, ఎం. మధు, చాంద్, కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ సమరిటన్ అవార్డు ప్రదానం



అవార్డ్ అందుకుంటున్న శంకరమ్మ

సింగరేణి(కొత్తగూడెం): మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నర్సింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న బడికెల శంకరమ్మకు గుడ్ సమరిటన్ అంతర్జాతీయ అవార్డ్‌ను ప్రదానం చేశారు. శనివారం రాత్రి రాజమహేంద్రవరంలోని హోటల్‌లో అమెరికన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో జరిగిన గ్లోబల్ పీస్ అవార్డ్–2024 పురస్కారాల కార్యక్రమంలో ప్రపంచశాంతి దూత ప్రొఫెసర్ మధు క్రిషన్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. రెక్టార్ ప్రాతిమా, సౌత్ ఇండియన్ డాక్టర్ అద్దంకి రాజా యోనా, డాక్టర్ మహాలక్ష్మీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వితరణ

టేకులపల్లి: కాంగ్రెస్ ఇల్లెందు నియోజకవర్గ నాయకుడు, ఎమ్మెల్యే సోదరుడు కోరం సురేందర్ కుమారుడు రాహుల్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక అమ్మ అనాథ శరణాలయంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానంతో పాటు బియ్యం, పండ్లు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, నాయకులు కోరం సురేందర్ , కోరం ఉమా, నాయకులు ఈది గణేష్, పోషాలు, వీరబద్రం, మధురెడ్డి, బండ్ల శ్రీనివాసరావు, రజినీ, రాజు, నాని, బొడ్డు అశోక్, బోస్, సర్దార్, రవి, సుదీప్ పాల్గొన్నారు.

దిగుబడినిచ్చే వంగడాలను ఎంచుకోవాలి



మిర్చితోటను పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: వ్యవసాయ రంగంలో రైతుల ఆలోచనా విధానంలో మార్పులు రావాలని అధిక దిగుబడినిచ్చే మిర్చి వంగడాలను ఎంచుకుని లాభాలు పొందాలని ఏడీఏ గుగులోత్ లాల్‌చంద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఇన్వెంటివ్ సీడ్స్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో తొమ్మిదోమైలుతండా పంచాయతీ కోటల్ల సమీపంలో తేజావత్ మంగీలాల్ మిర్చి తోటలో క్షేత్రస్థాయి పరిశీలన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సంతోష్, సదానందం, నిర్వాహకుడు రవి, డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కామేష్

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీకి పాలకవర్గం ఏర్పాటు చేసేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని, ప్రజాప్రతినిధుల అలసత్వంతోనే ఎన్నికలు జరగడంలేదని, ఇప్పటికైనా మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రా కామేష్ ప్రభుత్వాన్ని అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో హామి ఇచ్చి కూడా పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. ఎన్నికలు లేని కారణంగా అభివృద్ధి కుంటుపడటంతో పాటు, అధికారుల పనితీరుపై అజమాయిషీ కరువైందన్నారు. ఈ సమావేశంలో నాయకుల చెనిగరపు నిరంజన్ కుమార్, వినుకొండ రంజిత్, త్రివేణి, ఖలీల్, విన్ను తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష పవిత్రమైంది



పడి పూజలో కొత్వాల, తదితరులు

పాల్వంచ: అయ్యప్పస్వామి దీక్ష ఎంతో పవిత్రమైందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక అయ్యప్ప దేవాలయం నందు పలువురు ఇరుముడికి వెళ్తున్న సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శనివారం రాత్రి శాస్త్రీ రోడ్‌లో గల వ్యాపారి గూడెపు లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజలో పూజారి మాధవన్ నంబూద్రి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, శ్రీనివాస్, కనగాల రాంబాబు, మేడిద సంతోష్, మిరియాల కమలాకర్, లక్ష్మణ్, శంకర్ మణి, రాజలింగం, చారి, రాము, మహేశ్, శాంతి వర్ధన్, కోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి..



గుంతలమయంగా మారిన రహదారి

- తేలిన కంకర, గుంతలతో ఇబ్బందులు

సుజాతనగర్: సుజాతనగర్ నుంచి లక్ష్మీదేవిపల్లి, మంగ్రితండా గ్రామాలకు వెళ్లే బీటీ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుపై చాలా చోట్ల గుంతలు ఏర్పడటంతో పాటు, కంకర తేలి అధ్వానంగా తయారైంది. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలో వేసిన రోడ్డు పూర్తిగా పాడవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. హరిజనవాడ, లక్ష్మీదేవిపల్లి, మంగ్రితండా, గరీబ్‌పేట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రం సుజాతనగర్‌కు రావాలంటే ఈ రహదారి గుండానే రావాల్సి ఉంటుంది. సుజాతనగర్‌కు చెందిన పలువురు రైతులు కూడా ఈ దారి గుండానే పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రహదారి గుండా నిత్యం భారీ వాహనాలు వెళ్లడం వలన రహదారి అధ్వానంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. రహదారి మొత్తం గుంతలమయం కావడంతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.